

కథ

వసుంధర

# ఆయనే ఉంటే...

"ఆయనే ఉంటే..." అని ఆయన టూరెళ్ళినప్పట్నించీ ఎన్నిసార్లనుకున్నానో నాకే తెలియదు.

కాపురానికొచ్చి రెణ్ణెల్లయింది. మూడ్రోజుల క్రితం వెళ్ళారాయన ఆఫీస్ టూరు మీద. అంత వరకూ ఇంట్లో ఎంతమంది మున్నా ఉన్నది మేమిద్దరమే అన్నట్లు గడిచింది. ఎంతలా అంటే- వారం క్రితం తోడికోడలు రమ ఫోనొచ్చిందంటూ కార్డ్లెస్ అందిస్తే ఆడపడుచనుకుని "థాంక్స్ గిరిజా!" అన్నాను. ఆమె తెల్ల బోయి "అయ్యో... నేను గిరిజని కాదు, నీ తోడికోడలు రమని" అంది.

గతుక్కుమని, "నువ్వు రోజురోజుకీ మరీ చిన్నపిల్లలా కనిపిస్తున్నావ్ అక్కయ్యా!" అని సద్దేసాను.

అంతే- పొరపాటున కూడా ఇంకెవరూ చిన్నపిల్ల అనలేనంతగా ఉబ్బిపోయింది రమ. "ఏదో వంకన రోజూ గాలి తీసే మీ బావగారున్నారు కాబట్టి ఇంకా ఇలా ఉన్నాను. నువ్విలా పొగిడావంటే ఇక అంతే సంగతులు" అని ముచ్చటగానే మందలించి వెళ్ళిపోయిందామె.

నేనింకా ఇంట్లో ఎవర్నీ గుర్తుపట్టలేకపోవడానికి అందరివీ ఒకే వయసులూ కాదు. అత్తయ్య, మామయ్య పెద్దవారు. బావగారు ఆయనకంటే పొట్టి. మరిది ఆయనకంటే పొడుగు. రమ బొద్దుగా ఉంటే, గిరిజ సన్నగా రివటలా ఉంటుంది. సాన్నిహిత్యం అంతంతమాత్రమైనా కూడా వీళ్ళని సులభంగా గుర్తుపట్టొచ్చు. కానీ రోజంతా టీవీ చూస్తో, పుస్తకం చదివో చటుక్కున చూస్తే సన్నిహితులు కానివాళ్ళ ఆకారాలు ముందు అస్పష్టంగా కనిపించడం సహజం కదా! టీవీ, పుస్తకాలకి బదులు నాకు శ్రీవారు.

"ఏమే అత్తింట్లో అందరికీ తలలో నాలుకలా ఉంటున్నావా?" అంది ఫోన్లో అమ్మ.

అమ్మకెప్పుడూ అదే ధ్యాస. ఎందుకంటే పెళ్ళికి ముందు మాది చిన్న కుటుంబం. అందులో అన్నయ్య, వదిన అమెరికాలో ఉండడంతో, ఇంట్లో ఇక అమ్మ, నాన్న, ఓ పెళ్ళికానమ్మాయి అంటే నేను. అంతే!

పెళ్ళయ్యేక ఆ ఉమ్మడి కుటుంబంలో ఎలా ఇముడుతానో అని, "నువ్విక్కడ మా గురించి బెంగెట్టుకోక, అక్కడ అందరికీ తలలో నాలుకగా ఉంటూ మంచి పేరు తెచ్చుకోవాలి" అంటూ "నీ మొగుడొక్కడే నీవాడనుకోకు. ఇంట్లో అంతా నీవాళ్ళే అనుకుని సన్నిహితంగా ఉండు. ఎవరికేం కావాలో తెలుసుకుని అందర్నీ సంతోషపెట్టు" అని 'తలలో నాలుక' మంత్రోపదేశం కూడా చేసింది అమ్మ. చేసి ఊరుకుంటుందా... ఫోన్ చేసినప్పుడల్లా దాని గురించే అడుగుతూంటుంది.

"అంతా నువ్వు చెప్పినట్లే చేస్తున్నానమ్మా" అబద్ధం చెప్పాను.

"ఏం చేస్తున్నావ్ నీ మొహం! వెళ్ళి రెణ్ణెళ్ళు కావస్తోంది. తోడికోడల్ని ఆడపడుచనుకున్నావ్..."

కార్డ్లెస్లో స్పీకర్ ఫోన్ ఆన్లో వుందని అప్పుడు గ్రహించాను. వెంటనే ఆఫ్ చేసి, "గుర్తుపట్టక కాదు, రమక్కని సంతోష పెట్టాలని అన్నాను" అంటూ సమయస్ఫూర్తి అమ్మ దగ్గిర కూడా ప్రదర్శించాను.

మరి ఇంట్లో ఆయన నన్ను క్షణం కూడా వదలరన్న అసలు విషయం అమ్మకెలా చెప్పను? ఫోనొచ్చిన టైంకి ఆయన బాత్రూంలో ఉన్నారు కాబట్టి కానీ- మామూలుగా ఐతే ఎవ్వరికీ నేను ఒంటరిగా దొరకను. నిజానికి ఏ ఫోనొచ్చినా గిరిజ తీస్తుంది కానీ గిరిజ పెళ్ళికాని పిల్ల అని నాకొచ్చిన ఫోన్ రమ తెచ్చిచ్చింది. ఆయన ఆఫీసుకెళ్ళేక అందరితో కలుద్దామంటే అదీ కుదరదు. ఈ రోజుల్లో ఉత్త గ్రాడ్యుయేషన్ చాలదని నన్నాయన కంప్యూటరు కోర్సులో జేర్పించారు. రోజూ తనతో తీసుకెళ్ళి ఇన్స్టిట్యూట్లో దిగవిడుస్తారు. మళ్ళీ సాయంత్రం తనే పికప్ చేసుకుని ఇంటికి తీసుకొస్తారు. ఇంట్లో నన్నాయన లాలిస్తారు, మురిపిస్తారు, ప్రేమిస్తారు. మరపురాని మధుర ఘట్టాలు కల్పిస్తారు. ఆయనది నిద్ర ముంచుకొస్తున్నా నిద్రపోనివ్వని చిలిపితనం. నిద్ర రానప్పుడు కూడా నిద్రపుచ్చే అద్భుత స్పర్శ.

ఆ సాహచర్యం బాగుంది. కానీ అమ్మ చెప్పిందనే కాదు ఇంట్లో మిగతావాళ్ళ మాటలు, చూపులు ఆప్యాయంగా అనిపించి కూడా వాళ్ళతో సన్నిహితంగా మెలగాలని నాకు తహతహ. ఆ మాట చెబితే "నల్లనివన్నీ నీళ్ళు, తెల్లనివన్నీ పాలు అనుకోకు" అని హెచ్చరించారాయన. తనవాళ్ళ గురించి ఆయనే అలాగన్నందుకు ఆశ్చర్యపోతే, "మా వాళ్ళ గురించి నాకు తెలుసు. నీకు తెలియదు. నీ అంతట నువ్వు తెలుసుకునేదాకా ఈ ఇంట్లో నా మాట ప్రకారం నడుచుకో" అన్నారాయన.

"నా అంతట నేను తెలుసుకునేందుకు మీరు నన్ను వాళ్ళకి వదలాలిగా" అన్నాను.


"యు ఆర్ రైట్. ఇంట్లో వుండగా నేను నిన్ను వదలను" అన్నారాయన.


మురిసిపోతూనే, "ఐతే ఓ వారం రోజులు టూరేసుకుని ఎక్కడికైనా వెళ్ళండి" అన్నాను.

"వారం కాదు. ఒక్కరోజు టూర్లో వెళ్ళానంటే, 'అయ్యో ఆయనే ఉంటే ఎంత బాగుండేది' అని సెకనుకోసారైనా అనుకుంటావు" అన్నారాయన.

"అమ్మో మీకు పురుషాహంకారం చాలా వుందే. నేను లేకుండా సెకనైనా వుండలేనని ఒప్పుకోలేక మీరు లేకుండా నేనుండలేనని బెదిరిస్తున్నారా?" అన్నాను.

"నాకు పురుషాహంకారమా! అదే ఉంటే నీ పని పగలంతా మా వాళ్ళ సేవలూ, రాత్రిళ్ళు నాకు సేవలూనూ. ఇంట్లో అందరికీ నా మాటంటే విలువా, నన్ను కాదనడానికి సంకోచం ఉండబట్టి, ఏదో ఇలా నిన్ను మావాళ్ళ బారినుంచి కాపాడగల్గుతున్నాను. అర్థం చేసుకో" అన్నారాయన.





ఆయన్ని అర్థం చేసుకోవడం కష్టమే. భార్యా రూపవతీ శత్రుః అని భయపడే మగాళ్ళ గురించి విన్నాను. కానీ ఈయన మా ఊళ్ళో జరిగే 'లవ్‌లీ హౌస్‌వైఫ్స్' పోటీకి నా ఫోటో, బయోడేటా పంపారు. అలాంటి పోటీలకి అవసరమైన టిప్స్ ఆర్టికల్స్ కొన్ని సంపాదించి తను చదివి నాచేత చదివించారు. దానికో స్టేజి షో ఉంటుందని 'ప్రెట్టీ లుక్స్' బ్యూటీపార్లర్‌లో అపాయింట్‌మెంటు సాధించారు.

'ప్రెట్టీలుక్స్' మా ఊరికే టాప్ బ్యూటీ పార్లర్. అక్కడ అపాయింట్‌మెంట్ దొరకడమే కష్టం. అదీ స్టేజి షోకి ఒక్కరోజు ముందు దొరకడం నా అదృష్టం. అది తప్పితే మరో వారం దాకా స్లాట్సన్నీ బుక్కైపోయాయ్. ఉత్సాహం పట్టలేక అయినవాళ్ళం దరికీ చెబుదామన్నాను ఆయనతో.

"మూసకి భిన్నంగా వెళ్ళే ప్రయత్నాల్ని హర్షించ లేని సమాజం మనది. ఇక్కడ అసలైన పరాయివాళ్ళు అయినవాళ్ళే. కాబట్టి ఫైనల్ రిజల్ట్ తెలిసే దాకా అంతా రహస్యం" అన్నారు శ్రీవారు.

"అన్నాళ్ళూ దాచి చెబితే అప్పుడు మాత్రం హర్షిస్తారా?" అన్నాను ఆయన ఆంతర్యం అర్థంకాక.

"అదే విచిత్రం. ప్రయత్నిస్తే వెనక్కి లాగుతారు. ఓడిపోతే పరిహసిస్తారు. కానీ విజేతలని అభినందించ డానికి ఏమాత్రం సిగ్గుపడకుండా ముందుకొస్తారు. వాళ్ళే అయినవాళ్ళు" అన్నారాయన.

ఇప్పుడు 'ప్రెట్టీ లుక్స్' అపాయింట్‌మెంట్ ఇంక నాలుగు రోజులుంది. ఆయనకి మొదటిసారిగా ఆఫీస్ టూర్ పడింది. నేను దిగులు పడితే, "ఆరోజు మధ్యాహ్నం ఫ్లైట్లో వచ్చేస్తాగా, 'ప్రెట్టీలుక్స్' అపాయింట్‌మెంట్ సాయంత్రం ఆరింటికి... నాలుక్కి ముందే బందా హాజిర్" అని ధైర్యం చెప్పారాయన.

ఆ రాత్రి తొమ్మిదింటికి కారొచ్చింది ఆయన్ని ఎయిర్‌పోర్టుకి తీసుకెళ్ళడానికి. కారెక్కి ఆయన టాటా చెబితే తొలి విరహం రేపిన దుఃఖానికి నా కళ్ళ నిండా నీళ్ళు... మిగతావాళ్ళంతా చిరునవ్వుతూ చేతులూపారు.

నేను రెండు చేతులతోనూ కళ్ళొత్తుకుని చేయూపేలోగా కారెళ్ళిపోయింది.

వీధి తలుపులు మూసి లోపలికొచ్చేక మగాళ్ళు పడక గదుల్లోకి, ఆడాళ్ళం వంటింటివైపు. అప్పుడు గిరిజ ఆప్యాయంగా నా భుజం తట్టి, "కాపురానికొచ్చాక ఈ రెండు నెలల్లో ఒక్కరోజంటే ఒక్కరోజు విడిగా దొరుకుతావని చూసాను. కానీ అన్నయ్య వదిలితేనా? ఇక చూడు. ఈ మూడ్రోజుల్లోనూ నిన్ను నా చుట్టూ ఎలా తిప్పుకుంటానో" అంది.

ఆ పల్లవికి చరణంలా అందుకుని, "ఆడపడుచంటేనే అర్ధమొగుడు. అబ్బాయొచ్చేదాకా నిన్నే చిన్న వదినకి తోడుగా పడుకోమని నేనే అందామనుకున్నాను" అందత్తయ్య.

నాకింకా కొత్త కదా- సరేనన్నట్లు బుద్ధిగా తలూపాను. అత్తయ్య మెప్పుకోలుగా చూసి, "ఇంట్లో కుడికాలెట్టిన రోజే పట్టేసాను బుద్ధివంతురాలివని. అబ్బాయొదలక కానీ, నీకసలు రోజంతా నా సేవల్లోనే గడపాలనుందనీ కనిపెట్టాను. సేవలొద్దు కానీ వాడూళ్ళో లేని ఈ రెండ్రోజులైనా కనీసం ఓ డ్యూటీ తప్పించు.

తెల్లారి నాలుగున్నరకల్లా పాలవాడొచ్చి కాలింగ్‌బెల్లు కొడతాడుగా, వాడు రెండోసారి బెల్లుకొట్టి మిగతా వాళ్ళ నిద్ర పాడుచేసేలోగా నువ్వెళ్ళి తలుపుతీసి పాలు పోయించుకోవాలి. ఎందుకంటే నాకు నిద్ర చాలడం లేదు. ఈ వయసులో తగినంత నిద్ర లేకపోతే బీపీలోకి దింపుతుందని డాక్టరన్నాడు" అంది నాతో.

అత్తయ్యకి బీపీ సుగరూ లేవు. ఐనా పెద్ద వయసు కాబట్టి ముందు జాగ్రత్తగా రోజూ మార్నింగ్ వాక్ చేయమని ఫామిలీ డాక్టరు సలహా ఇచ్చాట్ట. అది పాటించి తీరాలని మా వారంటే జనసంచారం లేని రోడ్లమీద ఒంటరిగా నడవడానికి భయమని తప్పించుకోబోయింది. ఆయనూరుకుంటారా, తనకి ఈవెనింగ్ వాక్ రివాజుంది మొర్రోమనే మామయ్యని కూడా అత్తయ్యకి తోడుగా మార్నింగ్ వాక్ చేయడానికి ఒప్పించారు. అలా ఆవిడకి మార్నింగ్ వాకూ, దాంతోపాటే పాలు పోయించుకునే డ్యూటీ తగులుకున్నాయి. 'ఆయనే ఉంటే' అత్తయ్యారోజు పాల డ్యూటీ నాకప్పగించి మార్నింగ్ వాక్ డుమ్మా కొట్టేది కాదు.

నేను బుద్ధిగా తలూపి పాల గిన్నె తీసుకునేటంతలో గిరిజ, "అమ్మా! అసలే నాకూ చిన్న వదినదీ ఇది తొలిరాత్రి. కబుర్లయ్యేసరికి ఎంత టైమౌతుందో, ఎన్నింటికి పడుకుంటామో! పాలవాడి కోసం లేస్తే ఆ తర్వాత మరి నిద్రపట్టదు. అంతలా నిద్రలేకుండా నేనుండలేను. కాబట్టి పాల డ్యూటీ పెద్దవదినకియ్యి" అంది.

గిరిజ కాస్త ముదురనీ, వాగనిస్తే నోటికి అదుపుండదనీ, తనకి భయపడి తనుండగా పెదవి విప్పదనీ ఆయన నాకు చెప్పారు. ఇప్పుడాయన ఇలా గుమ్మం దాటగానే అలా తను పలికిన నాలుగు మాటల్లోనే విశ్వరూపం చూపించింది గిరిజ. తన దూకుడు సంగతెలాగున్నా పాలడ్యూటీ తప్పిందని సంతోషించేలోగా "మీ అన్నా చెల్లెళ్ళిద్దరిదీ ఒక్కటే పోలిక. పాలడ్యూటీకి ఆయన ఒప్పుకోరు" అనేసింది రమ.

"ఐతే నేను చిన్నవదిన దగ్గిర పడుకోను. కానీ ఈరోజుకి తోడు కావాలని ఫిక్సైపోయాను కాబట్టి నువ్వు నా దగ్గిర పడుకో. అప్పుడు నాకు డబల్ అడ్వాంటేజ్. చిన్నవదినైతే కొత్త కాబట్టి కబుర్లుంటాయి. కానీ పాత బడ్డ నిన్ను చూస్తూనే ఆవలింతలొస్తాయ్. ఇక నిద్రే నిద్ర" అంది గిరిజ తనూ వెంటనే.

గిరిజకి తోడు పిచ్చి ఉంది. వచ్చిన కొత్తలో నన్ను తోడుగా పడుకోమని అడిగితే నేనాయనకి చెప్పాను.


"భార్యాభర్తలు విడిగా పడుకోకూడదని ఈ ఇంట్లో అలిఖిత శాసనం. నాన్నుండగా చెల్లి కూడా అమ్మ పక్కన పడుకుందుకు లేదు" అని కొట్టిపారేసారాయన.

అంత సూటిగా చెప్పకపోయినా ఇప్పుడు రమ కూడా "చెప్పడం మరిచానత్తయ్యా! ఆయనకి తలనొప్పిట. వచ్చేటప్పుడు అమృతాంజనం తెమ్మన్నారు" అనేసి అక్కణ్ణించి హడావుడిగా వెళ్ళిపోయింది.

అత్తయ్య ముసిముసిగా నవ్వుతూనే కూతుర్ని ముచ్చటగా చూసి, "మొన్ననే పదిహేడు నిండాయి. దీనికింకా అల్లరి తగ్గలేదు" అంది.

"అమ్మ మాటలు నిజమనుకునేవ్ వదినా! సెన్సస్ వాళ్ళు కనుక అమ్మని నమ్మితే నాకీ జన్మకి ఓటు హక్కు రాదు. నీకు పాలడ్యూటీ పడింది కాబట్టి తొందరగా పడుకోవాలి. నాకేమో ఆశపడ్డ తోడు దొరక్క నిరాశ. ఇప్పట్నించీ ప్రయత్నిస్తే ఎప్పటికి నిద్ర పట్టేనో ఏమో గుడ్‌నైట్" అని వెళ్ళిపోయింది గిరిజ.

"నాకూ నిద్రొస్తోందమ్మా" అంటూ అత్తయ్య మామయ్య గదిలోకెళ్ళింది.



వాళ్ళందర్నీ చూస్తే ముచ్చటేసి "కుటుంబం ఉమ్మడి కుటుంబం, చల్లని హృదయాలకూ చక్కని ప్రతిబింబం" అని అప్రయత్నంగా పాడుకుంటూ, నా గదిలోకెళ్ళి పాలగిన్నె బల్లమీద పెట్టి మంచం మీద వాలి కళ్ళు మూసుకుంటే నిద్రకి బదులు నాలుగున్నరకి మెలకువ రాదేమోనన్న భయం పుట్టింది.

ఆఫీసులో చేరిన కొత్తలో మావారు తొలిసారిచ్చిన పర్చేజ్ ఇండెంట్‌లో తప్పులెన్ని, 'ప్రథమ చుంబనే దంతభగ్నే' అని విశ్లేషించేట్ట వాళ్ళ ఫర్చేజాఫీసరు. ఇప్పుడు అత్తయ్య చెప్పిన మొదటి పని విషయంలో అలా జరక్కూడదని నాలుగింటికే అలారం పెట్టాను.

తొలిసారిగా ఆ యింట్లో ఒంటరితనం. ఆపై అలారం మోగినా మెలకువొస్తుందో రాదోనని భయం. ఇక నిద్రేం పడుతుంది? మా యింట్లో ఐతే నన్ను నిద్ర లేపడానికి అలారం అమ్మ పెట్టుకునేది. ఇప్పుడూ 'ఆయనే ఉంటే' అలారం డ్యూటీ ఆయనకిచ్చే

## మళ్లీ ఇన్నాళ్లకు...

ఐశ్వర్యారాయ్-అక్షయ్ కుమార్ 2002లో 'ఖాకీ' అనే సినిమాలో కలిసి నటించారు. మళ్లీ ఇప్పటి వరకూ ఇద్దరూ ఒకే సినిమాలో కనిపించలేదు. మళ్లీ ఇన్నాళ్లకు 'యాక్షన్ రీప్లే' అనే సినిమాలో జంటగా నటిస్తూ ఆ సినిమాకి అట్రాక్షన్ అవుతున్నారు. ఈ సినిమా దర్శకుడు విపుల్ షా తెగ ఆనందపడుతున్నాడు, అందాల రాశి-యాక్షన్ కింగ్‌లను ఇన్నాళ్లకు కలిపి సినిమా తీసే భాగ్యం తనకే కలిగినందుకు. మరి ఈ సినిమా ఎలాంటి విజయం సాధిస్తుందో చూడాలి!

దాన్ని. కానీ 'ఆయన ఉంటే' నాకీ పాల డ్యూటీ పడేది కాదుగా! అదేమిటో- వెళ్ళి ఇంకా కొన్ని గంటలవలేదు ఆయనన్నట్లే 'ఆయనే ఉంటే' అని తెగ అనిపిస్తోంది.

రాత్రంతా నాకు కలత నిద్రే! మెలకువొస్తే టైము చూడ్డం. అలా మూడు దాటేక మరి నిద్రలేదు. 'ఆయనే ఉంటే' నిద్రలేపి కబుర్లు మొదలెట్టేదాన్ని. అప్పుడేం చేయాలో తోచక పక్కనున్న వారపత్రిక తీసి పేజీలు తిప్పితే అందులో నిద్ర మీద వ్యాసం. మనిషి జీవితంలో నిద్రే ప్రధానంట. వేళకి పడుకుని వేళకి లేవకపోతే ఆరోగ్యం దెబ్బతింటుందట. సులభంగా నిద్రపట్టే కొన్ని చిట్కాలు కూడా ఉన్నాయా వ్యాసంలో. ఉత్తప్పుడెలా పనిచేస్తాయో కానీ ఇప్పుడవి చదివితేనే మత్తొచ్చేసింది. చటుక్కున పుస్తకం మూసి టైము చూస్తే నాలుగైంది. ఇంకో అరగంటలో పాలవాడొచ్చేస్తాడు.

పోనీ అమ్మకి ఫోన్ చేద్దామంటే- పాపం తన నిద్ర పాడౌతుందని జాలి. అదీకాక ఫోన్లో మొదలెడితే అమ్మకిక వళ్ళు తెలియదు. ఆ కబుర్లలో పాలవాడు రెండోసారి కాలింగ్‌బెల్ మోగించేస్తాడని అనుమానం. పోనీ ఆయనకి ఫోన్ చేద్దామంటే ఆ కబుర్లలో నాకు వళ్ళు తెలియని భయం.

పూర్తి మెలకువొచ్చేసింది. మంచం మీదేం చేస్తానని పాల గిన్నె తీసుకుని వీధి తలుపు తీసి గుమ్మంలో నించున్నాను. మార్నింగ్ వాక్ అనగానే అంతా మా అత్తగారి టైపో ఏమో రోడ్డంతా నిర్మానుష్యం. ఉన్నట్లుండి ఓ హైస్కూలు కుర్రాడు కాబోలు ఒంటరిగా జాగింగ్ చేస్తూ మా ఇంటివైపు చూసాడు. మసక చీకట్లో చెదిరిన జుట్టుతో దెయ్యంలా కనిపించానో ఏమో కెవ్వుమని ఒకటే పరుగు.

తెల్లవారు ఝామున ఒంటరిగా జాగింగు చేస్తూ, దెయ్యాల్ని నమ్మడం సిగ్గుచేటే అయినా, నేను తల దువ్వుకోకుండా వీధి గుమ్మంలో నిలబడ్డం అంతకంటే సిగ్గుచేటని నా వయసు హెచ్చరించింది. లోపలకెళ్ళి తలుపు మూసానోలేదో ఇంటిముందు పాలవాడి మోపెడ్ ఆగిన చప్పుడైంది. వాడు బెల్ కొట్టేలోగా తలుపు తీసేయాలనుకుని చటుక్కున వెళ్లి తలుపు తీసాను.

అత్తయ్యైతే రెండోసారి కాలింగ్‌బెల్ మోగితేకానీ తలుపు తీయదు. తీసాక రెండోసారి మోగించాడని తిట్టి పాలు పోయించుకుంటుంది. అలాంటిదీ రోజు కాలింగ్‌బెల్ కొట్టకుండానే తలుపు తెరుచుకుని, గుమ్మంలో నేను ప్రత్యక్షమయ్యేసరికి అప్పటికింకా ఇంటి మెట్లెక్కుతున్న పాలవాడు ఏమనుకున్నాడో తనూ కెవ్వుమన్నాడు. తర్వాత నేనెవరో తెలుసుకుని, "మిమ్మల్నిదేనమ్మా మొదటిసారి చూడ్డం" అంటూ సారీ చెప్పి పాలు పోసి వెళ్ళాడు.

"లవ్లీ హౌస్‌వైఫ్స్' పోటీకి సన్నద్ధమౌతున్నానేమో, పాలవాడితో కలిపి అప్పటికిద్దరు నన్ను దెయ్యమనుకోవడం నా అహాన్ని దెబ్బతీయగా 'ప్రెట్టీలుక్స్' విజిట్ అర్జంటనిపించింది. కానీ దానికీ ఆయనుండాలి. అక్కడ వాళ్ళు చూపించే ఫోటోలు చూసి ఏ స్టైలు నాకు నప్పుతుందో ఆయనే చెబుతారు.

ఆ మూడురోజుల్లో ఇంట్లోవాళ్ళతో క్రమంగా నాకు సాన్నిహిత్యం పెరిగినా ఆయనే ఉంటే అనిపించిన సందర్భాలెన్నో. ఐతే ఆ మాట రమ, గిరిజల దగ్గర తప్ప ఇంకెవరి దగ్గిరా అనలేదు.

చివరికాయన టూర్నించి వచ్చే సమయం ఆసన్నమైంది. ఫ్లైట్ రైట్ టైముకే వచ్చిందనీ మరో అరగంటలో వస్తున్నాననీ ఆయన ఇంటికి ఫోన్‌లో చెబితే నా ఆనందం వర్ణనాతీతం.

"వెళ్ళినప్పట్నించీ ఆయనే ఉంటే ఆయనే ఉంటే అని తెగ కలవరిస్తోంది. ఇక ఆయనే ఉంటాడని తెలియగానే మీ చిన్నకోడలి ముఖం చూడండత్తయ్యా" అంది రమ ముచ్చటగా అత్తయ్యతో.



అత్తయ్యకి నీతులు చెప్పడం సరదా. "తప్పమ్మా! ఆయన ఉంటే అనగానే 'ఆయనే ఉంటే క్షౌరమెందుకూ' అన్న పాత సామెత గుర్తొస్తుంది. ఇంకా కాళ్ళ పారాణి ఆరని ముత్తైదువ్వి. నీకు క్షౌరమేమిటీ- మాటిమాటికీ ఆయనే ఉంటే అనకు. ఇంతకీ ఆయన ఉంటే- ఆయన ఉంటే అని కలవరిస్తున్నావుట. వాడు రాగానే ఏమిటి మీ ప్రోగ్రాం?" అంది అత్తయ్య కుతూహలంగా.

"ఆయనే ఉంటే మీరీ సామెత చెప్పేవారు కాదత్తయ్యా!" అన్నాను చటుక్కున. ఎందుకంటే 'ప్రెట్టీ లుక్స్' బ్యూటీ పార్లర్‌కి నన్ను తీసుకెళ్ళేదే ఆయన. మరక్కడ నా జుట్టు కట్ చేసే కార్యక్రమం కూడా ఉంది. ఎందుకని నిలదీసింది అత్తయ్య. కానీ ఎందుకో చెప్పే బాధ్యత నేను తీసుకోలేదు. ఆయనకే వదిలాను.

## అది నా కష్టార్జితం

ఇటీవల ప్రియమణి టొయోటా ఇన్నోవా కారు కొన్నది. అయితే ఇది ఆమె స్వయంగా కొన్నది కాదని ఓ హీరో ఆమెకి కానుకగా ఇచ్చాడని జోరు జోరుగా టాలీవుడ్‌లో వినిపించడం మొదలైంది. దీని గురించి ప్రియమణి స్పందిస్తూ- 'ఇలాంటి పనికిమాలిన పుకార్లు ఎవరు పుట్టిస్తారో అర్థంకాదు. నా కష్టార్జితంతో కొనుక్కున్న కారు గురించి కూడా ఇలాంటి వార్తలు సృష్టిస్తున్నారు. నాకా కారుని ఎవరూ గిఫ్టుగా ఇవ్వలేదు. నేనే కొనుక్కున్నాను. అయినా ఇలాంటి వాటిని పట్టించుకోకుండా వుంటేనే బెటర్' అంటూ తేల్చిపారేసింది.